బతుకమ్మ కుంటలో వ్యర్థాల తొలగింపు



సోమయ్య నగర్ కుంటను శుభ్రం చేస్తున్న సిబ్బంది

జగద్గిరిగుట్ట: బతుకమ్మ పండుగ ముగియడంతో డివిజన్ పరిధిలోని బతుకమ్మ కుంటలో వ్యర్థాలను తొలగిస్తున్నారు. కుంటను శుభ్రం చేసే పనుల్లో జీహెచ్ఎంసీ అధికారులు నిమగ్నమయ్యారు. డివిజన్ పరిధిలోని భూదేవి హిల్స్, సోమయ్య నగర్‌లలోని బతుకమ్మ కుంట వద్ద ఆదివారం సిబ్బంది శుభ్రం చేశారు.

అమ్మవారి బంగారు లాకెట్ వేలం



బంగారు లాకెట్‌ను దక్కించుకున్న సుధాకర్

రంగారెడ్డినగర్: రంగారెడ్డినగర్ పోచమ్మ ఆలయం వద్ద దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు వేడుకల్లో భాగంగా ఆదివారం వేలంపాట వేశారు. అమ్మవారి చేతిలోని ఒక గ్రాము బంగారు లాకెట్‌ను వేలం నిర్వహించారు. ఆరుట్ల సుధాకర్ రూ. 1.35 లక్షలకు, 50 గ్రాముల వెండి లాకెట్‌ను రూ.85 వేలకు నందిమల్ల ప్రవీణ్ కుమార్ దక్కించుకున్నారు. అనంతరం అమ్మవారిని ఘనంగా ఊరేగింపు నిర్వహించి నిమజ్జనానికి తరలించారు. ఆలయ కమిటీ సభ్యులు బాలరాజు యాదవ్, మామిడాల రవీందర్‌రెడ్డి, దేవేందర్, రమేష్, పరిష వేణు, సుధాకర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఓవర్‌టేక్ చేయబోయి వాహనం ఢీ



చింతల్: వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి మరో వాహనాన్ని ఢీకొంది. ఈ ఘటన బాలానగర్ నుంచి నర్సాపూర్ రాష్ట్ర రహదారిలో ఆదివారం ఉదయం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బాలానగర్ నుంచి ఓ టిప్పర్ వెళ్తుంది. వీఆర్ఎల్ లాజిస్టిక్స్, మ్యాట్రిక్స్ ఫార్మా పేరుతో ఉన్న మినీ బస్సు ఉషా కంపెనీ దాటిన తర్వాత టిప్పర్‌ను ఓవర్‌టేక్ చేయబోయి ఢీకొంది. దీంతో మినీ బస్సు డ్రైవర్ వైపు భాగం పూర్తిగా దెబ్బతిన్నది. సమాచారం అందుకున్న ట్రాఫిక్, లాండ్ ఆర్డర్ పోలీసులు అక్కడికి చేరుకొని మినీ బస్సు నడుపుతున్న డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు. అనంతరం క్రేన్ సహాయంతో టిప్పర్, మినీ బస్సును ప్రధాన రోడ్డు మీద నుంచి పక్కకు తొలగించారు.

కంకర పరిచి.. నిర్మాణం మరిచి!



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ సాయినగర్‌లో సంవత్సర కాలంగా డ్రైనేజీ పనులు చేపట్టిన అధికారులు పనుల విషయంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. నెలల తరబడి డ్రైనేజీ విషయంలో చేసిన తవ్వకాలతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. డ్రైనేజీ పనులు పూర్తైనా రోడ్డు నిర్మాణం చేపట్టక నిర్లక్ష్యం వహించారు. ఎట్టకేలకు పది రోజుల క్రితం రోడ్డు కోసం కంకర పరిచి వదిలేశారు. ప్రస్తుతం ఈ కంకరతో ఎన్ని రోజులు గడుపుతారని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. రోడ్డు పనులు వెంటనే పూర్తి చేసి స్థానికుల ఇబ్బందులను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

మోతీనగర్: పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివని, వారికి ఏమిచ్చినా తక్కువేనని అవంతినగర్ తోట సంక్షేమ సంఘం అధ్యక్షులు జి. వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఆర్. సత్యనారాయణ స్వామి అన్నారు. దసరా పండుగ పురస్కరించుకొని ఆదివారం మూసాపేట డివిజన్ అవంతి నగర్ తోట సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్మికులకు చీరలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు పగలు, రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో టీవీ సుబ్బారావు, రవీందర్‌రెడ్డి, దత్తాత్రేయ, నారాయణ, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు చేయూత

ఆర్థిక తోడ్పాటుకు పురపాలక శాఖ లోక్ కల్యాణ్ మేళా

- రుణ పరిమితి 3 విడతల్లో రూ.15 వేల నుంచి రూ.50 వేలకు పెంపు
- పీఎం స్వనిధి కింద ఈ నెల 15 వరకు దరఖాస్తుల స్వీకరణ.
- నగర శివారు మేడ్చల్,రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 34 పురపాలక సంఘాల్లోని వీధి వ్యాపారులకు లబ్ధి

పట్టణాల్లో వీధి వ్యాపారుల సామాజిక భద్రతకు కేంద్రం చర్యలు



సాక్షి,మేడ్చల్ జిల్లా: పురపాలికల్లో చిరు వ్యాపారాలు చేస్తూ జీవనం సాగిస్తున్నా వారికి ఆర్థికంగా ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తోంది. గత ఐదేళ్లుగా వీధి వ్యాపారులకు అందించే ప్రధానమంత్రి స్వనిధి రుణాలను తిరిగి పొందేందుకు చర్యలు చేపట్టారు. గత నెల 17 నుంచి అక్టోబర్ 2 వరకు శిబిరాలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయగా, దీని గడువు ఈనెల 15 వరకు పొడిగించారు. లోక్ కల్యాణ్ మేళా పేరుతో వీధి వ్యాపారులకు లక్ష్యం కంటే అధిక రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. కొత్తగా రుణాలు తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నట్లుగా తెలుస్తోంది. పాత వారికి కూడా రుణ మొత్తాన్ని పెంచడంతో ఆర్థిక అవసరాలు తీరనున్నాయి. సామాజిక భద్రత కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అనుసంధానం చేసి ఆయా పథకాలకు అర్హులుగా ఎంపిక చేస్తారు..నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి ,రంగారెడ్డి జిల్లాలలో 34 మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో కూరగాయలు, కొబ్బరి బోండాలు, తోపుడు బండ్లపై పండ్లు, బజ్జీల వంటి విక్రయాలు, ప్రధాన కూడళ్లలో దుస్తులు, ప్లాస్టిక్ వస్తువులు అమ్ముకోవడం, తదితర వారందరినీ ఈ పథకంలో చేర్చనున్నారు.

రుణ పంపిణీ సులభతరం

పునరుద్ధరించిన పీఎం స్వనిధి పథకం కింద కొత్తగా దరఖాస్తులను ప్రోత్సహించనున్నారు. ఇప్పటికే మంజూరైన దరఖాస్తులను రుణ పంపిణీ సులభతరం చేయడం, బ్యాంకుల్లోని పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడం, ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ ఆథారిటీ ఆఫ్ ఇండియా సహకారంతో ఆహార విక్రేతలకు శిక్షణ వంటివి ఇవ్వనున్నారు.

వీధి వ్యాపారులకు ప్రత్యేక శిక్షణ

ఆహార పదార్థాలు విక్రయించే వారికి నాణ్యమైన ఆహార పదార్థాలు, కల్తీ లేకుండా వినియోగించడం, తదితర అంశాలపై రెండు విడతలుగా ప్రత్యేక శిక్షణ ఇవ్వడానికి ప్రణాళిక రూపొందించారు. ఫుడ్ సేఫ్టీ లైసెన్స్ ఇప్పించడం, ప్రత్యేక ప్రచార కార్యక్రమాల్లో బ్యాంకులు, డిజిటల్ పేమెంట్ ఎగ్రిగేటర్లు, టౌన్ వెండింగ్ కమిటీలు, ఫుడ్ సేఫ్టీ అధికారులు, ఎన్జీఓలు, విక్రేతల సంఘాలు తదితర ఆర్గనైజేషన్లను భాగస్వామ్యం చేయనున్నారు.

రుణ పరిమితి పెంపు..

పీఎం స్వనిధి కింద గతంలో రూ.10 వేలు రుణం అందించగా లోక్ కల్యాణ్ మేళా పేరుతో ఆ మొత్తాన్ని పెంచారు. మొదటి విడతలో రూ.15 వేలు, సక్రమంగా చెల్లిస్తే రూ.25 వేలు, రెండు విడతలు సరిగ్గా చెల్లించిన వారికి మూడో విడతలో రూ.50 వేలు అందిస్తారు.

వైభవంగా ఓనం వేడుక



ఓనం వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: స్నేహం, ప్రేమ, ఐక్యతల పరిమళం వెదజల్లే పండుగే ఓనం అని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. జీడిమెట్ల మళయాలీస్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం ప్యారడైజ్ ఫంక్షన్ హాల్‌లో 22వ ఓనం వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఎమ్మెల్యే మాట్లాడారు. మనం ఎక్కడ నివసిస్తే అక్కడే తాము పుట్టిన ప్రాంతాన్ని మరువకుండా ఓనం పండుగ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో మలయాలీస్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షులు కె. కె.పొన్నప్పన్, వైస్ ప్రెసిడెంట్ లాలూ కుట్టన్, జనరల్ సెక్రటరీ పి. కె.రమేష్, జాయింట్ సెక్రటరీ సునీల్ సూరారం, ట్రెజరర్ ఈఎం.బైజు, అడ్వైజర్ విశ్వనాథన్, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు సునీల్ బిజు, సీఎన్. రాజు, శిజు, ప్రదీప్, డానియల్ తదితరులు పాల్గొన్నారు.

బాలుడి అదృశ్యం



శ్యామ్‌కుమార్

కుత్బుల్లాపూర్: ఇంటి ముందు ఆడుకుంటున్న బాలుడు అదృశ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గుండ్లపోచంపల్లి లక్ష్మీనగర్‌లో నివాసముండే లక్ష్మి కి ఇద్దరు కుమార్తెలు. కాగా పెద్ద కుమార్తె రెండేళ్ల క్రితం మృతి చెందడంతో ఆమె ఇద్దరు కుమారులు ఏపీ నర్సిపట్నంలోని లక్ష్మి అమ్మానాన్నల వద్ద ఉంటున్నారు. దసరా సెలవులు నేపథ్యంలో చిన్న మనుమడు శ్యామ్‌కుమార్ (07) వారం రోజుల క్రితం లక్ష్మి వద్దకు వచ్చాడు. ఈ నెల 3న లక్ష్మి పని నిమిత్తం ఉదయం 7 గంటలకు బయటకు వెళ్లి మధ్యాహ్నం 12 గంటలకు ఇంటికి వచ్చి చూసే సరికి మనుమడు కనిపించలేదు. చుట్టు పక్కల వారిని, బంధువుల ఇళ్లల్లో వాకబు చేసినా ఫలితం లేకపోయింది. దీంతో బాధితులు పేట్‌బషీరాబాద్ పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో 102 మందిపై కేసు నమోదు

కుత్బుల్లాపూర్: మేడ్చల్ ట్రాఫిక్ డీసీపీ పరిధిలో సెప్టెంబరు 29 నుంచి అక్టోబరు 4 వరకు ఆరు రోజుల పాటు నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్‌లో 102 మంది ద్విచక్ర వాహనదారులు పట్టుబడ్డారు. జీడిమెట్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 38, అల్వాల్ పరిధిలో 31, మేడ్చల్ పీఎస్ పరిధిలో 21, బాలానగర్ ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 12 మంది ద్విచక్ర వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడగా వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను సీజ్ చేశారు.

మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట



భవానీ నగర్‌లో పర్యటిస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం స్థానిక అభివృద్ధిపై చిన్నచూపు చూస్తే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ఆదివారం గాజులరామారం డివిజన్ భవానీనగర్‌లో పర్యటించారు. రూ.41 లక్షలతో సీసీ రోడ్డు పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. మూడు పర్యాయాలు అధికారంలో ఉన్న ప్రజాప్రతినిధి భవానీనగర్‌ను పట్టించుకోలేదని విమర్శించారు. స్థానికులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని జిల్లా ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకువెళ్లామని, రూ.41 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. ఏ సమస్య నెలకొన్న వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బస్తీ ప్రెసిడెంట్ గోపాలకృష్ణ, జనరల్ సెక్రటరీ ప్రతాప్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వై.పాండు, నర్సింగ్ రావు, మని కుమార్, చౌదరి తదితరులు పాల్గొన్నారు.

చెత్త కుప్పలు తరలించరా?



రాజీవ్ గృహకల్ప 1వ బ్లాక్ వద్ద ..

జగద్గిరిగుట్ట: చెత్త కలెక్షన్ పాయింట్ల వద్ద రోజుల తరబడి చెత్తను తరలించకపోవడం కూడా అధికారుల లోపంగా చెప్పుకోవచ్చు. డివిజన్ పరిధిలోని పలు చోట్ల చెత్తను ఆదివారం మధ్యాహ్నం వరకు కూడా తరలించకపోవడంతో కుప్పలా పేరుకుపోతున్నాయి. అంతేకాకుండా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి వ్యాధులు కూడా ఎక్కువ అవుతుండడంతో స్థానిక ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తమ స్పందించి చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని స్థానికులు కోరుతున్నారు.



రింగ్ బస్తీలో పేరుకుపోయిన చెత్త

త్రివేణి స్కూల్ విద్యార్థినికి నగదు పురస్కారం



నగదు పురస్కారం అందుకుంటున్న విద్యార్థిని అక్షయ

చింతల్: గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ టాలెంట్ టెస్ట్‌లో చింతల్ త్రివేణి స్కూల్ విద్యార్థిని ప్రతిభ కనబరిచింది. ఈ టెస్టులో పాల్గొన్న త్రివేణి విద్యార్థిని అక్షయ ప్రథమ స్థానంలో నిలిచి నగదు పురస్కారానికి గెలుచుకుంది. ఎల్బీ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాతా గుప్తా చేతుల మీదుగా అక్షయ రూ.5వేల నగదు పురస్కారం అందుకుంది. పాఠశాలలో నిర్వహించిన అభినందన కార్యక్రమంలో సీఆర్‌ఓ వెంకట్రావు, సీఎస్‌ఓ సుబ్బారావు, స్కూల్ ప్రిన్సిపాల్ శివ కీర్తన, ఉపాధ్యాయులు అక్షయను అభినందించారు.

దొరికిన బంగారు గొలుసు పోలీసులకు అప్పగింత



ఎస్ఐకి బంగారు గొలుసును అందజేస్తున్న నవీన్‌కుమార్, అనీల్‌కుమార్

దుండిగల్: సరదాగా చాయ్ తాగేందుకు వెళ్లిన ఇద్దరు సోదరులకు రెండున్నర తులాల బంగారు గొలుసు దొరికింది. ఆ గొలుసును పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గండి మైసమ్మలో ఆదివారం జరిగింది. కుంటాల నవీన్ కుమార్, కుంటాల అనిల్ కుమార్ సోదరులు గండి మైసమ్మ వద్ద ఉన్న పిస్తా హౌస్‌లో చాయ్ తాగేందుకు వెళ్లారు. వారికి రెండున్నర తులాల బంగారు గొలుసు దొరికింది. ఈ విషయాన్ని గుండ్ల పోచంపల్లి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మారేపల్లి సుధాకర్‌కు తెలియజేశారు. అతను వారితో కలిసి సబ్ ఇన్‌స్పెక్టర్ రంజిత్ రెడ్డికి బంగారు గొలుసును అప్పజెప్పారు. అనంతరం పోలీసులు గొలుసు పోగొట్టుకున్న వారిని పిలిపించి అందజేశారు. మానవతా దక్పథంతో దొరికిన సొమ్మును పోలీసులకు అప్పగించి మానవత్వం చాటుకున్న వారిని పోలీసులు అభినందించారు.

ప్రమాదకరంగా పాఠశాల ప్రహరీ



డివిజన్ పరిధిలోని ఓ ప్రభుత్వ పాఠశాల ప్రహరీ ప్రమాదకరంగా ఉంది. పది రోజులుగా డ్రైనేజీ నీరు నిలుస్తున్నాయి. దీంతో ప్రహరీ కింది భాగం దెబ్బతింది. దీంతో ఎప్పుడు ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రమాదం జరగకముందే ప్రహరీకి మరమ్మతులు చేయాలని పలువురు కోరుతున్నారు. – జగద్గిరిగుట్ట

హైడ్రా వేసిన ఫెన్సింగ్ తొలగింపు

- బ్లూషీట్స్ వేసిన ఎమ్మెల్యే గాంధీ అనుచరులు
- స్పందించని అధికారులు



హైడ్రా ఫెన్సింగ్ వేసిన ప్రాంతం

కుత్బుల్లాపూర్: గాజులరామారం పరిధిలోని సర్వే నెంబర్ 307లో గత నెలలో హైడ్రా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున కూల్చివేతలు చేపట్టారు. ఇందులో సుమారు 260 పేదల ఇండ్లను నేలమట్టం చేశారు. అదే విధంగా ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కుటుంబ సభ్యులకు చెందిన సుమారు 11 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకున్నామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ప్రకటించారు. కూల్చివేతలు చేపట్టిన రెండు, మూడు రోజుల్లోనే హైడ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫెన్సింగ్‌ను గాంధీ అనుచరులు తొలగించారు. ఇటీవల ఏకంగా 11 ఎకరాల విస్తీర్ణం చుట్టూ తిరిగి బ్లూషీట్స్‌ను ఏర్పాటు చేయడం ప్రస్తుతం వివాదాస్పదం అవుతుంది. సామాన్యుల ఇళ్లను కూల్చివేసిన హైడ్రా.. ప్రస్తుతం ఎమ్మెల్యే గాంధీ చర్యలపై ఎలా స్పందిస్తుందనేది సర్వత్ర ఉత్కంఠ నెలకొంది. స్థానిక రెవెన్యూ అధికారులు సైతం ఈ విషయంలో స్పదించకపోవడం పట్ల అనేక అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

ప్రభుత్వ భూమా?, ప్రైవేట్ భూమా?

ఎమ్మెల్యే గాంధీ ఆధీనంలో ఉన్న స్థలం సైతం సర్వే నెంబర్ 307లోనే వస్తుందని తేల్చిన హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టి ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అయితే ఇది ప్రైవేట్ స్థలమని గాంధీ వాదిస్తున్నారు. మరి ఈ భూమి ప్రైవేట్‌దా?, ప్రభుత్వానిదా? అనేది మాత్రం అధికారులు పూర్తి స్థాయిలో క్లారిటీ ఇవ్వాల్సిన అవసరం ఉంది. హైడ్రా అధికారులు ఈ విషయంలో కనీసం అవగాహన లేకుండా కూల్చివేతలు చేపట్టారా?, లేక ఏమైన రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి సైలెంట్ అయ్యారా? అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఏది ఏమైనా ఈ విషయంలో అధికారులు స్పష్టత ఇచ్చి ఈ సస్పెన్స్‌కు తెరదించాల్సిన అవసరం ఉంది.



హైడ్రా ఆధ్వర్యంలో బ్లూషీట్స్ ఫెన్సింగ్‌ను కూల్చివేసిన దృశ్యం



బ్లూషీట్స్ ఫెన్సింగ్ ఏర్పాటు చేసిన ప్రాంతం

నేడు టీజీహెచ్‌బీ స్థలాల వేలం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- కబ్జాలు కాకుండా ఈఈ ప్రత్యేక చొరవ



ఐడీపీఎల్ చౌరస్తాలోని 2 ఎకరాల టీజీహెచ్‌బీ స్థలం

రంగారెడ్డినగర్: ఒకప్పుడు అక్రమ పార్కింగ్‌లు, భవన నిర్మాణ సామాగ్రి విక్రయదారులకు అడ్డాగా మారిన టీజీహెచ్‌బీ స్థలాలు నేడు ప్రభుత్వానికి వేలం పాట ద్వారా కోట్లాది రూపాయల ఆదాయాన్ని సమకూర్చనున్నాయి. వేలంపాట వివరాలను అందించేందుకు ఆదివారం ఏపీహెచ్‌బీ కాలనీలోని టీజీహెచ్‌బీ అధికారులు బ్రోచర్లు, ఇతర వివరాలను ఔత్సాహికులకు అందించారు.

కథనాలకు స్పందించి.. స్వాధీనం చేసుకొని

రంగారెడ్డినగర్ డివిజన్ పరిధి ఏపీహెచ్‌బీ కాలనీలో సుమారు 1.5 ఎకరాలు, అదే విధంగా ఐడీపీఎల్ చౌరస్తాను ఆనుకుని మరో 2 ఎకరాల టీజీహెచ్‌బీ స్థలం ఉంది. టీజీహెచ్‌బీ స్థలాల వేలం పాట సోమవారం, గురువారం (9వ తేదీ) జరుగనుంది. దీంతో ప్రభుత్వానికి కోట్లాది రూపాయల ఆదాయం సమకూరనుంది. గతంలో ఈ స్థలాలు కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. 'సాక్షి'లో ప్రచురితమైన కథనాలకు అధికారులు స్పందించారు. సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుని టీజీహెచ్‌బీ బోర్డులను ఏర్పాటు చేశారు. భూముల సంరక్షణకు ఈఈ అంకంరావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.

వేలం నిర్వహించే ప్లాట్ల వివరాలు ఇలా..

- ఎంఐజీ -2 ప్లాట్ నెంబరు 106- 284.10 చదరపు గజాలు, ప్లాట్ నెంబరు 107- 285.62, ప్లాట్ నెంబర్ 108పీ -250.06 గజాలు, ప్లాట్ నెంబర్ 113 - 428.90 గజాలు, ప్లాట్ నెంబర్ 114- 266.66 గజాలు, ప్లాట్ నెంబర్ 120పి- 199.42 గజాలు, ప్లాట్ నెంబర్ 121- 277.67 గజాలు, ప్లాట్ నెంబర్ 122- 267.33 గజాలు ప్లాట్లకు యూనిట్ ప్రైజ్‌గా గజానికి రూ.60వేలు నిర్ణయించారు.
- హెచ్ఐజీ ప్లాట్ నెంబర్ 12 నుంచి 20 వరకు (388.88 గజాలు),
- హెచ్ఐజీ 21(513.38 గజాలు) ప్లాట్లకు గజానికి యూనిట్ ప్రైజ్‌గా రూ.80 వేలు నిర్ణయించారు.
- బీ1/ఎఫ్27, బీ2/ ఎఫ్20, బీ2/ఎఫ్24, బీ2/ఎఫ్27 ఒక్కొక్కటి 412.43 చదరపు గజాల ప్లాట్లకు రూ.15 లక్షల ప్రైజ్ నిర్ణయించారు.

వేలం పాట ఏర్పాట్లు పూర్తి



ఐడీపీఎల్ చౌరస్తాలోని టీజీహెచ్‌బీ స్థలంలో జరిగే వేలం పాట కార్యక్రమానికి విస్తృత ఏర్పాట్లు చేశాం. ప్లాట్లు దక్కించుకున్న వివరాలను మైక్‌ల ద్వారా వెల్లడిస్తాం. వేలం పాటలో పాల్గొన్న వారికి భోజన వసతి ఏర్పాటు చేశాం.
– అంకమరావు, ఈఈ, టీజీహెచ్‌బీ నార్త్



ఐడీపీఎల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బ్యానర్



ఏపీహెచ్‌బీ కాలనీలోని 1.5 ఎకరాల టీజీహెచ్‌బీ స్థలం



ఏపీహెచ్‌బీ కాలనీలో టెంట్ వేసుకుని బ్రోచర్లతో టీజీహెచ్‌బీ అధికారులు